# పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

## డీఎల్పీఓ ఫణిందర్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని డీఎల్పీఓ ఫణిందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తర్నం, కుమారి గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న 'ఫ్రైడే.. డ్రైడే' కార్యక్రమాల అమలు, దోమల నివారణ చర్యలు, పరిసరాల పరిశుభ్రతపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం ప్రజల ఆరోగ్యానికి నేరుగా సంబంధించిన అంశమని, గ్రామాల్లో పరిశుభ్రత నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ జీవన్రెడ్డి, తర్నం, కుమారి గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

# అనక బాపూరావును పరామర్శించిన ఆత్రం సుగుణ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన అనక బాపూరావు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాపూరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లే ష్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబానికి ఆత్రం సుగుణ పరామర్శ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన వరముని లక్ష్మిబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్ష్మిబాయి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి తదితరులు ఉన్నారు.

# నేరడిగొండలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ను ఏర్పాటు చేసి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజ్జెల శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరడిగొండ మండలంలో 90 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. మండలంలో నాణ్యమైన ప్రభుత్వ విద్యాసంస్థలు లేకపోవడంతో విద్యార్థులు మెరుగైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి పూర్తయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు, దూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో ఇక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు

- కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్
- దుబార్పేట్లో రూ.10 లక్షల వ్యయంతో వంతెన ప్రారంభం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ప్రజల ఆశయాలే మా కార్యాచరణకు మార్గదర్శకమని, ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని దుబార్పేట్ గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వంతెనను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ ప్రవీణ్ విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమం గ్రామస్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ఈ వంతెన నిర్మాణంతో సమస్యలు తొలగనున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి సహకరించి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేసిన ఆడే గజేందర్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కళ్యెం నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్, మాదాపూర్ సర్పంచ్ ఇమ్రాన్ షాదుల్లా, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తూరు లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజ్, కేశవపట్నం మాజీ ఎంపీటీసీ రషీద్, నాయకులు చోలే ప్రభాకర్, మహమూద్, గంగారాం, మౌలానా, ఫారుఖ్, పటేల్ నాగరావు, గ్రామస్తులు భీంబాయి, కోసెరావు, వెంకటి, సలేరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్లో చేరికలు

- బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్

**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ప్రజా పాలనకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్లో చేరుతున్నారని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. ఇచ్చోడ తాండాకు చెందిన గ్రామ పెద్దలు, యువకులు సుమారు 50 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ప్రజల మధ్య నిరంతరం పనిచేసే నాయకుడిగా ఆడే గజేందర్ గుర్తింపు పొందారని, ఆయన నాయకత్వంలోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఆడే గజేందర్ నాయకత్వంలో బోథ్ నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా సాగుతోందని, పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇచ్చోడ తాండా నుంచి పార్టీలో చేరిన వారిలో రమేష్, వెంకట్రాం, భాను సింగ్, సీతారాం, మోహన్ సింగ్, రతన్ సింగ్, రాహిదాస్, చరణ్ సింగ్, గజానంద్, గణేష్, సాయి, రుద్రారాం, సేవాలాల్, ప్రేమ్సింగ్, బాబూలాల్, గోపాల్, శ్రీకాంత్, విజయ్, యువకులు, గ్రామ పెద్దలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో



మండల కన్వీనర్ కళ్యెం నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యావతి కోటేశ్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తూరు లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, కేశవపట్నం మాజీ ఎంపీటీసీ రషీద్, నాయకులు చోలే ప్రభాకర్, మహమూద్, మౌలానా, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ఉర్స్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

## తాండూర్ ఎస్సై ప్రసాద్రావు

**ఉద్యమ కెరటం, తాండూర్:** ఉర్స్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ పోలీసు శాఖ సూచనలను పాటించాలని తాండూర్ ఎస్సై ప్రసాద్రావు కోరారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లిఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ దేవయ్య పర్యవేక్షణలో ఉర్స్ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టినట్లు




తెలిపారు. శుక్ర, శనివారం మేజర్ తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దర్గా వద్ద జరిగే ఉర్స్ జాతరకు భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ట్రాఫిక్ను మళ్లిస్తున్నట్లు తెలిపారు. శనివారపు అంగడి బజారు నుంచి రేచిని, అచలాపూర్ వెళ్లే ప్రయాణికులు అశోక్నగర్–రచ్చబండ మార్గంలో ప్రయాణించాలని సూచించారు. అలాగే తాండూర్, రేచిని, అచలాపూర్ వైపు నుంచి ఐబీ ప్రాంతానికి వెళ్లే వారు గ్రంథాలయం–రచ్చబండ మీదుగా రేచిని రైల్వే అండర్బ్రిడ్జి మార్గాన్ని వినియోగించాలని కోరారు. జాతరకు వచ్చే వాహనాల కోసం తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, పాత సరస్వతి శిశుమందిర్ ఆవరణలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సేవల వాహనాలను మినహాయించి ఇతర వాహనాలను జాతర ప్రాంతంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారని, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా మొత్తం ప్రాంతాన్ని పర్యవేక్షిస్తామని వివరించారు. భక్తులు విలువైన ఆభరణాలు, నగదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలీసు శాఖ సూచనలు పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# తిర్యాణిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్యూ డిమాండ్

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విద్యాసంస్థల బంద్ తిర్యాణి మండల వ్యాప్తంగా విజయవంతమైందని పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు జాడి వంశీ, జిల్లా ఉపాధ్యక్షుడు లెనిన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో విద్యారంగానికి సంబంధించిన అనేక సమస్యలు నెలకొన్నప్పటికీ వాటి పరిష్కారంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు విఫలమ



య్యారని విమర్శించారు. రాష్ట్రంలో 24వేల పాఠశాలలను కేవలం 4వేలకే పరిమితం చేసే నిర్ణయం అమలైతే పేద, గిరిజన విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల విలీన నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి, అక్కడ మధ్యాహ్న భోజన పథకాన్ని బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న రూ.10వేల కోట్లకు పైగా స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించే చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు, లింగభేదం లేకుండా విద్యార్థులందరికీ ఉచిత బస్పాస్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవాదాస్, నాయకులు విజయ్కుమార్, కుంటాల పవన్, సంతోష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్
- సిరికొండలో రూ.21 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఉద్యమ కెరటం, సిరికొండ:** గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. సిరికొండ మండల కేంద్రంలో రూ.21 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్థానిక సర్పంచ్తో కలిసి పనులను ప్రారంభించిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.10 లక్షలతో మహిళా సంఘాల కోసం ఆధునిక వీఓ భవనం, రూ.5లక్షలతో బోయవాడ కమ్యూనిటీ హాల్ సమీపంలో కల్వర్టు, రూ.4లక్షలతో భీమన్న ఇంటి నుంచి పోచమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు, రూ.2 లక్షలతో స్వామి ఇంటి నుంచి సంటి శంకర్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామాల రూపురేఖలు మారేలా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు బొడ్డు దత్తాత్రి, ఉప సర్పంచ్ తోకల రాజు, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, ఇచ్చోడ మండల కన్వీనర్ కళ్యెం నారాయణ రెడ్డి, మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్, జిల్లా కార్యదర్శి షేక్ ఇమామ్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుంరం చంద్రకళ రఘురామ్, మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్, పలువురు సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య..?

- గుడిహత్నూర్ పరిధిలో మృత దేహం లభ్యం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** ఆదిలాబాద్ మండల పరిధిలోని లింగుగూడ పిప్పల్ ధరి గ్రామానికి చెందిన టేకం బలరాం(45) అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి అన్న కుమారుడైన టేకం వేణుగోపాల్ గుడిహత్నూర్ ఎస్ హెచ్ఓ శ్రీకాంత్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్లో అందిన ఫిర్యాదు ప్రకారం.. లింగుగూడ పిప్పల్ ధరి గ్రామానికి చెందిన టేకం బలరాం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఐదు సంవత్సరాలుగా ఆయన ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. పిల్లల చదువుల కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో, వాటిని వెంటనే తీర్చాలంటూ భార్య సుష్మ, కుమారుడు కిరణ్ నిరంతరం గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కూడా ఇంట్లో గొడవ జరిగింది. దీంతో బలరాం భార్య పుట్టింటికి వెళ్ళిపోగా, బలరాం ఆదిలాబాద్లోని వినాయక్ చౌక్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లారు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతకడం ప్రారంభించారు. శుక్రవారం ఉదయం గుడిహత్నూర్ పరిధిలో రోడ్డు పక్కన ఉన్న ఓ కల్వర్టు వద్ద వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం అందింది. మృతుడి కుమారుడు కిరణ్ అక్కడికి వెళ్లి చూడగా, తన తండ్రి టేకం బలరాం మృతదేహమేనని గుర్తించాడు. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా లభించడంతో, ఇంట్లో జరిగిన గొడవల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు గుడిహత్నూర్ ఎస్ హెచ్ఓ శ్రీకాంత్ ను కలిసి ఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# గుడిహత్నూర్ ఎక్రోస్ డ్లో నూతన రోడ్డు నిర్మాణం పూర్తి



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎక్రోస్డ్ ప్రాంతంలో నూతనంగా చేపట్టిన రెడ్ గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం పూర్తయ్యాయి. గ్రామ సర్పంచ్ ఆడే శీల ప్రత్యేక చొరవతో ఈ పనులు పూర్తి కావడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎక్రోస్డ్ ప్రాంతంలో సరైన రహదారి లేక గత కొంత కాలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యను గుర్తించిన సర్పంచ్ యుద్ధప్రాతిపదికన నిధులు సమకూర్చి, నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించారు. రోడ్డు అందుబాటులోకి రావడంతో రాకపోకలు సులభతరమయ్యాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నాళ్లుగానో ఉన్న సమస్యకు పరిష్కారం చూపిన సర్పంచ్ కు గ్రామస్థులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ పనితీరును స్థానికులు ప్రశంసించారు.

# ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందించాలి




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఓటర్లు బూత్ లెవెల్ అధికారుల ద్వారా అందించిన ఎన్యుమరేషన్ ఫారాలను నింపి తిరిగి బీఎల్ఓలకు అందించాలని బెజ్జూర్ తహశీల్దార్ రామ్మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల పరిధిలోని ఓటర్లకు బీఎల్ఓలు ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారని తెలిపారు. ప్రతి ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసి, రెండు పాస్పోర్టు సైజు ఫొటోలు జతచేసి సంతకం చేసి బీఎల్ఓకు అందజేయాలని కోరారు. బీఎల్ఓ ఒక ప్రతిని తన వద్ద భద్రపర్చుకొని, మరో ప్రతిని ఓటరుకు అందజేస్తారని వివరించారు. ఒకవేళ ఓటరు అందుబాటులో లేకపోతే, వారి కుటుంబ సభ్యులు పూరించిన ఫారాలను బీఎల్ఓకు అందజేయవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయడానికి ప్రతి ఓటరు సహకరించాలని కోరారు.

# ఎస్ఐఆర్లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

ఈనెల 24లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తి చేయాలి

భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ సూచించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఓటరు జాబితాను నవీకరించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన భారత పౌరులు, సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్ట పరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు చేసుకునే హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ లెవల్ అధికారుల పనితీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణ, తొలగింపు ప్రక్రియలను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని త్వరితగతిన పూర్తి చేసి, ఈనెల 24వ తేదీలోగా డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారం సమర్పించిన ప్రతి ఓటరును ముసాయిదా జాబితాలో చేర్చుతామని, సరైన విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. అభ్యంతరాలపై విచారణ అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటామని, తుది జాబితా విడుదల తర్వాత అసంతృప్తి ఉన్నవారు జిల్లా మేజిస్ట్రేట్కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డేటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను పరిశీలిస్తూ డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ సబ్ స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతు పనులను చేపట్టనున్నట్లు నేరడిగొండ విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మరమ్మతుల కారణంగా నేరడిగొండ మండలంలోని వాంకిడి, కుప్టి, వెంకటాపూర్, కెఎన్ఆర్ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# చదువుతోనే పిల్ల లకు ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- డోర్లి గ్రామంలో నూతన పాఠశాల భవనం ప్రారంభం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** చదువుతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. తలమడుగు మండలంలోని డోర్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వీబీజీ రామ్జీ స్కీమ్ ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. గతంతో పోలిస్తే పాఠశాలలో వసతులు మెరుగుపడ్డాయని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా త్వరలోనే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతిరోజూ హోంవర్క్ ఇచ్చి పర్యవేక్షించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గతంలో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా గ్రామస్థులు పాఠశాల సమస్యలను తన దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందించి భవన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. నాణ్యతతో పనులు పూర్తి చేసిన ఇంజనీరింగ్ అధికారులు, సర్పంచ్, కాంట్రాక్టర్ను అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీఈఓ మాధవి, పంచాయతీరాజ్ ఈఈ శివరాం, తహశీల్దార్ రాజ్మోహన్, ఎంపీడీఓ శంకర్, సర్పంచ్ పూజ, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవీందర్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్ల పై విచ్చలవిడిగా తిరిగే పశువులను కట్టడి చేయాలి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను వెంటనే కట్టడి చేయాలని సమాచార హక్కు చట్టం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి లింగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి వైకుంఠంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమ్మరి లింగన్న మాట్లాడుతూ మండల కేంద్రానికి ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్లపై సంచరించే పశువుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వాహనదారులు, పాదచారుల భద్రత దృష్ట్యా గ్రామపంచాయతీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి కోరారు. వర్షాకాలం, ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో పంటలకు కూడా నష్టం కలగకుండా పశువుల యజమానులు తమ పశువులను భద్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ సర్పంచ్, పాలకవర్గ సభ్యుల తీర్మానం మేరకు త్వరలో గ్రామసభ నిర్వహించి ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గ్రామంలో తిరిగే పశువులను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

- మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుషా
- డ్రై డే–ఫ్రైడేతో కేఆర్కే కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుషా అన్నారు. పట్టణంలోని కేఆర్కే కాలనీలో శుక్రవారం డ్రై డే–ఫ్రైడే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చైర్పర్సన్ ప్రత్యేక చొరవతో సుమారు రూ.40లక్షల నిధులను అత్యవసరంగా కేటాయించి పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఇందుకోసం 50 మంది ప్రత్యేక కార్మికులతో పాటు జేసీబీలు, ట్రాక్టర్లను రంగంలోకి దించి కాలనీలో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టి నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని 49 వార్డుల్లో ఇదే తరహాలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పారిశుద్ధ్యాన్ని పాటించాలని సూచించారు. కాలనీ అంతటా బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు సానిటేషన్ స్ప్రే నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వర్షాకాలాన్ని దృష్టి లో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాధన ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలో పట్ట ణంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల కేసులు నమోదైన నేపథ్యంలో ఈ ఏడాది ముందస్తు జాగ్రత్తలను మరింత పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య, మున్సిపల్ సానిటేషన్ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి వ్యాధుల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రతి వారం కనీసం మూడు రోజుల పాటు కాలనీల్లో పర్యటిస్తూ నీటి నిల్వలను తొలగించడం, అపరిశుభ్ర ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రం చేయడం, అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లడం, రసాయనాలు పిచికారీ చేయడం, లార్వా నివారణకు ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్ట ర్ సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, సానిటేషన్ ఎస్సై శంకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, అలాగే సీఎంఆర్ సరఫరాలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్ట ర్ వి.రాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నస్పూర్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. జీపీఓలు, బీఎల్ఓలు, బీఎల్ఓ, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడంతో పాటు సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి దశలో నాణ్యత, పారదర్శకతను పాటిస్తూ నిర్ణీత కాలపరిమితిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలోని వాసవి రైస్ మిల్, లక్ష్మీ గణపతి రైస్ మిల్, అంబికా సాయి రైస్ మిల్లులను తనిఖీ చేశారు. సీఎంఆర్ ప్రభుత్వానికి సకాలంలో అందజేయాలని మిల్లు యాజమాన్యాలకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ సరఫరా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఇకపై ఎలాంటి ఆలస్యానికి అవకాశం లేకుండా మిల్లింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. తదనంతరం మంచిర్యాల మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, జీపీఓలు, బీఎల్ఓలు, ఇతర అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.



పెండింగ్లో ఉన్న ఎస్ఐఆర్ కార్యకలాపాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారాన్ని స్పష్టంగా నమోదు చేయడంతో పాటు డిజిటలైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని, డేటా నమోదు సమయంలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేని క్రిమిసంహారక మందుల విక్రయాలపై కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుటే వెంకటి



**ఉద్యమ కెరటం, కౌటాల:** గుర్తింపు లేని క్రిమిసంహారక మందుల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వసాయ అధికారి బోర్కుటే వెంకటి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, లైసెన్సులు, విక్రయ రికార్డులను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. అక్రమంగా ఎరువులను నిల్వ చేయరాదని, లైసెన్సులో నమోదు చేయని, గుర్తింపు లేని క్రిమిసంహారక మందులను రైతులకు విక్రయించవద్దని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ గుర్తింపు లేని పురుగు మందులను విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిస్తూ రైతులు పంటల సాగు చేపట్టాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాలను అవలంభిస్తే నష్టా లను తగ్గించుకోవచ్చన్నారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు గణశామ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

